క్లుప్తంగా

డాక్టరేట్ ప్రదానం


మనోజ

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిశోధన విద్యార్థిని పద్యాల మనోజ డాక్టరేట్ అందుకుంది. వర్సిటీలో పర్యాటక శాఖ విభాగానికి చెందిన డాక్టర్ కోట నీలమణికంఠ పర్యవేక్షణలో వివిధ అంశాలపై అధ్యయనం చేసింది. మనోజను సోమవారం ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, ఎగ్జామ్స్ నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.మధుమతి, పర్యాటక శాఖ విభాగాధిపతి డాక్టర్ పి.సుజాత తదితరులు అభినందించారు.

బిల్లుల్లో తేడా లేకుండా చర్యలు

• ఏడీఈ సుబ్రహ్మణ్యం

సాక్షి ఎఫెక్ట్..

పొదలకూరు: పీఎం సూర్యఘర్ పథకానికి సంబంధించి బిల్లుల్లో తేడా లేకుండా చర్యలు తీసుకుంటామని పొదలకూరు విద్యుత్ ఏడీఈ సుబ్రహ్మణ్యం తెలిపారు. సాక్షిలో సోమవారం 'సూర్యఘర్.. బిల్లుల్లో తేడాలు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఏడీఈ, ఏఈ శ్రీకాంత్‌లు స్పందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిల్లులు తేడా ఉందని వెల్లడించిన వేమారెడ్డి అనే వినియోగదారుడి ఇంటికెళ్లి మీటర్లను పరిశీలించామన్నారు. గతనెల 21 నుంచి సోలార్ విద్యుత్ వినియోగించడం వల్ల ప్రతి నెలా 1 నుంచి 5వ తేదీ వరకు బిల్లులను అందజేయడంతో తేడాగా భావిస్తున్నట్టు తెలిపారు. అన్ని విషయాలను వివరించామన్నారు. సోలార్ విద్యుత్ వినియోగించే వారు ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాల్సిందిగా సూచించారు. సబ్సిడీ మొత్తం త్వరలో అందజేస్తారన్నారు. ప్రతి ఆరునెలలకోసారి సోలార్ మిగులు విద్యుత్‌కు లెక్కలు కట్టడం జరుగుతుందని వెల్లడించారు.

వడదెబ్బపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగేంద్రబాబు

ఇందుకూరుపేట: వడదెబ్బపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ నాగేంద్రబాబు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జగదేవిపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వడదెబ్బపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ అన్నిశాఖల పరిధిలో ప్రజలకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయాలని కోరారు. వైద్యారోగ్య సిబ్బంది అవసరమైన చోట ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందించాలని కోరారు. వైద్యాధికారి బ్రహ్మేశ్వరనాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్లు నాయక్, ఏపీఎం సరిత, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి


వెంకటాచలం: రైతులతో ఏడీఏ శ్రీనివాసులు

వెంకటాచలం: రైతులు తమ పొలాల్లో తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏడీఏ ఎస్.శ్రీనివాసులు సూచించారు. వెంకటాచలంలోని పలువురు రైతుల పొలాల్లో సోమవారం భూసార పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పద్ధతులపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉంటే లాభాలబాటలో పయనిస్తారని అన్నదాతలకు సూచించారు. భూసార పరీక్షల ద్వారా భూమిలోని లోపాలను తెలుసుకుని, తదనుగుణంగా పంటలు సాగు చేసుకోవచ్చన్నారు. ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించారు. ఆయన వెంట మండల వ్యవసాయశాఖాధికారి హరికరుణాకర్‌రెడ్డి ఉన్నారు.

సద్వినియోగం చేసుకోండి

కొడవలూరు: వ్యవసాయశాఖ ద్వారా భూసార పరీక్షలు చేస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ లక్ష్మి కోరారు. మండలంలోని నార్నురాజుపాళెంలో మట్టి నమూనాలను సోమవారం సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షల వల్ల బహుళ ప్రయోజనాలున్నాయన్నారు. ఈ పరీక్షల ఆధారంగా ఎరువులు, పురుగు మందులు వినియోగించడం వల్ల మంచి ఫలితాలను సాధించవచ్చన్నారు. రైతుల సంబంధిత రైతు సేవా కేంద్రాల్లోని వీఏఏను సంప్రదించి భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ పి.వెంకట్రావు, వీఏఏ డి.శివజ్ఞాన, వీఆర్వో మల్లికార్జున, రైతులు పాల్గొన్నారు.

అవగాహన తప్పనిసరి

విడవలూరు: మట్టి పరీక్షలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఏఓ పి.వెంకటకృష్ణయ్య అన్నారు. మండలంలోని అన్నారెడ్డిపాళెం, ముదివర్తి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాన్ని ఆయన సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు మట్టి పరీక్షలు చేయించడం ద్వారా సరైన మోతాదులో ఎరువులు వాడొచ్చని, నేల సారాన్ని పెంచి సరిపడా పంటను వేసుకోవచ్చని తెలియజేశారు. అదేవిధంగా పెసర, మినుము వంటి పంటలను సాగు చేయడం ద్వారా నేల సారాన్ని పెంచడమే కాకుండా లాభాలను పొందవచ్చని సూచించారు. ఇప్పటివరకు మండలంలో 1,200 మట్టి నమూనాలను సేకరించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వీఏఏలు బి.కామాక్షి, ఎ.సాయిలక్ష్మి పాల్గొన్నారు.


కొడవలూరు : నార్నురాజుపాళెంలో..


విడవలూరు : మట్టిని పరిశీలిస్తున్న ఏఓ వెంకటకృష్ణయ్య

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి


పంటల గురించి వివరిస్తున్న అధికారులు

ముత్తుకూరు: ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు విజ్ఞప్తి చేశారు. మండలంలోని ముసునూరువారిపాళెంలో సోమవారం భూసార పరీక్షలు, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్, కేవీకే శాస్త్రవేత్త శివజ్యోతి, అనూష తదితరులు మాట్లాడారు. వరికి ప్రత్యామ్నాయంగా ఈ వేసవిలో పెసర, నువ్వు పంటలు అనుకూలమని చెప్పారు. 2025 – 26 సంవత్సరానికి మండలానికి 835 మట్టి నమూనాలు సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఏడీఏ అన్నారు. ప్రతి రైతు సేవా కేంద్రం 60 నుంచి 70 నమూనాలు సేకరించాలన్నారు. ఈ పరీక్షల వల్ల పొలంలో పోషకాల పరిమాణాన్ని తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి జోత్స్న రాణి, వీఏఏ గోవర్ధన్ పాల్గొన్నారు.

ప్రతిభా అవార్డుల మహోత్సవం


నగదు బహుమతి అందజేస్తున్న ఎంఈఓ

పొదలకూరు: మండలంలోని తాటిపర్తి ఎంపీపీఎస్ ఎస్సీ పాఠశాలలో సోమవారం పాఠశాల వార్షికోత్సవ ప్రతిభా అవార్డుల మహోత్సవాన్ని నిర్వహించారు. దాతలు రాఘవేంద్ర, రంగయ్యలు వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ప్రతి తరగతిలో విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు, జ్ఞాపికలను ఎంఈఓ – 2 శోభనాద్రి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు ముందుకొచ్చి విద్యార్థులను ప్రోత్సహించడం మంచి పరిణామంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు చెంచమ్మ, కాంప్లెక్స్ హెచ్‌ఎం నాగమోహన్‌రెడ్డి, యూటీఎఫ్ మండలాధ్యక్షుడు కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాతలను సన్మానించారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి


పొదలకూరు: మాట్లాడుతున్న సీడీపీఓ


మనుబోలు: ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీలు తదితరులు

• సీడీపీఓ విజయలక్ష్మి

పొదలకూరు: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి అన్నారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాటిపర్తి గ్రామంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిడ్డకు రెండు సంవత్సరాల వయసు వచ్చే వరకు సంరక్షించి వారి ఎత్తు, బరువును చూసి అవసరమైతే పౌష్టికాహారాన్ని అందజేస్తామన్నారు. గర్భిణులు ఆకుకూరలు, కూరగాయాలు, పండ్లు తీసుకోవాల్సిందిగా వెల్లడించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సీహెచ్ ఆదినారాయణమ్మ, అంగన్వాడీ టీచర్లు పుష్పవేణి, పద్మజ, వరలక్ష్మి, లక్ష్మీకాంతమ్మ, సుజాత, రోహిణి, శరణయ్య, హెల్పర్ బుజ్జమ్మ, ఏఎన్‌ఎంలు కవిత, బేబీ, స్కూల్ టీచర్లు ఖాదర్‌బాషా, జ్యోతి పాల్గొన్నారు.

⇨ మనుబోలు: పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మనుబోలు దళితవాడ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలున్న ఆహార పదార్థాలను ఎలా తయారు చేసుకోవాలో చూపించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు విజయమ్మ, నిర్మల, సుగుణమ్మ, శ్రీలక్ష్మి, మునెమ్మ, సుజన పాల్గొన్నారు.

షుగర్ ఫ్యాక్టరీపై 24న సదస్సు


మాట్లాడుతున్న నాయకులు

కోవూరు: షుగర్ ఫ్యాక్టరీ భవిష్యత్ కార్యాచరణపై 24వ తేదీన జిల్లా స్థాయి సదస్సు జరుగుతుందని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రఘురామయ్య అన్నారు. కోవూరులోని సీపీఎం కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబు అధికారంలోకి రాగానే ఫ్యాక్టరీని తెరిపిస్తానని హామీ ఇచ్చారన్నారు. అయితే హామీని అమలు చేయకపోగా ఫ్యాక్టరీని ఏపీఐఐసీకి అప్పగించి ఉద్యోగావకాశాలు కల్పిస్తానని ప్రకటన చేశారన్నారు. దీనిపై భవిష్యత్ కార్యాచరణ కోసం 24వ తేదీ షుగర్ ఫ్యాక్టరీ ఆవరణలో జరిగే సదస్సులో షేర్‌దారులు, రైతులు పాల్గొనాలని కోరారు. ఈ సదస్సులో ఆలిండియా చెరుకు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి రవీంద్రన్, రాష్ట్ర చెరుకు రైతుల సంఘ కార్యదర్శి సూర్యనారాయణ, జిల్లా నాయకులు పాల్గొంటారని తెలియజేశారు. రైతు సంఘ జిల్లా కార్యదర్శి గండవరపు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.శ్రీరాములు, ఎం.వెంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జె.వెంకమరాజు, సీఐటీయూ నాయకుడు దయాకర్, రైతు సంఘ నాయకులు జి.శేషయ్యబాబు, పి.మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

26న మండల స్థాయి వాలీబాల్ పోటీలు

మనుబోలు: మండలంలోని మడమనూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 26వ తేదీన మండల స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నారు. దివంగత చిన్న శేషమ్మ 27వ సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు పముజుల మోహన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 25 తేదీ సాయంత్రం లోపు ఆపేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. విజేతలకు రూ.20 వేలు, రన్నరప్‌కు రూ.15 వేలు, మూడో స్థానంలో నిలిచిన వారికి రూ.10 వేల బహుమతులు అందజేస్తామన్నారు. వివరాలకు 99455 13509, 94936 96946 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

నేడు వెంకటేశ్వరస్వామి కల్యాణం

పొదలకూరు: స్థానిక లక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం సాయంత్రం 6 గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం జరుగుతుందని నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని దామరమడుగు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో ప్రతిభ చూపడంతో వారికి సోమవారం సర్టిఫికెట్లు అందజేశారు. తొలుత వారు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీ రామ్‌కుమార్, హెచ్‌ఎం నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

విడవలూరు: మండలంలోని ఊటుకూరు పంచాయతీ గొల్లపాళేనికి చెందిన సూరిశెట్టి నాగార్జున(33) అనే వ్యక్తి స్థానిక బీజేపీ కార్యాలయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం మేరకు.. ఊటుకూరు గ్రామానికి చెందిన నాగార్జున అనే యువకుడు ఊటుకురులోనే ఆటో మెకానిక్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఈయన రోజూ రాత్రి వేళల్లో స్థానిక బీజేపీ కార్యాలయంలో నిద్రపోయేవాడు. ఆదివారం రాత్రి కార్యాలయంలో పడకోగా, సోమవారం ఉదయం అక్కడికి చేరుకున్న గ్రామస్తులకు ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు. వెంటనే వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడికి చేరుకుని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని ఇంటికి తరలించి అంత్యక్రియలు పూర్తి చేశారు. అయితే ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

పాఠశాల ప్రహరీ కూల్చివేతపై విచారణ

• నోటీసులు అందజేయాలని జెడ్పీ సీఈఓ ఆదేశం


పాఠశాలకు సమీపంలో రికార్డులను పరిశీలిస్తున్న సీఈఓ

పొదలకూరు: పట్టణంలోని రామనగర్‌గేటు సెంటర్‌లో డీఎన్నార్ జెడ్పీ హైస్కూల్ ప్రహరీ కూల్చివేసిన ప్రైవేట్ వ్యక్తులు దుకాణాలను నిర్మిస్తున్నారని కొందరు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆనంద్ ఆదేశాల మేరకు సోమవారం జెడ్పీ సీఈఓ విద్యారమ విచారణ నిర్వహించారు. దుకాణాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ సురేఖ వద్దనున్న రికార్డులను చూశారు. పాఠశాలకు సంబంధించిన స్థలం 2.80 ఎకరాలు కాగా ఇందులో 6 సెంట్లు ఆక్రమణలో ఉన్నట్టు అధికారులు చర్చించుకున్నారు. రికార్డుల ప్రకారం బడి స్థలాన్ని వెంటనే సర్వే చేసి స్కెచ్ అందజేయాల్సిందిగా సీఈఓ ఆదేశించారు. ఆక్రమణలకు గురై ఉంటే మంగళవారం సంబంధిత వ్యక్తులకు పంచాయతీ సెక్రటరీ ద్వారా నోటీసులను అందజేసి వారి నుంచి వివరణ తీసుకోవాలన్నారు. సరైన వివరణ ఇవ్వకుండా ఆధారాలు చూపకుంటే ఆక్రమణలను తొలగించాల్సిందిగా ఆదేశించారు. మండల సర్వేయర్ యుద్ధప్రాతిపదికన సర్వే స్కెచ్‌ను అందజేయాల్సిందిగా పేర్కొన్నారు. సీఈఓ విచారణ నిర్వహిస్తున్న సందర్భంగా ఇరువర్గాల వారు అక్కడికి చేరుకున్నారు. విద్యారమకు స్థలం వివరాలను వెల్లడించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ దశాబ్దాల క్రితం డేగా కుటుంబం పాఠశాల కోసం స్థలాన్ని అందజేసిందన్నారు. అయితే ఆ స్థలంలో 7 సెంట్లను ప్రజా ప్రయోజనాల కోసం తిరిగి ఇవ్వాల్సిందిగా వారు అభ్యర్థించడంతో అప్పట్లో అప్పగిస్తూ జెడ్పీ ఉత్తర్వులు ఇచ్చినట్టు పేర్కొన్నారు. ఈ అంశంపై జెడ్పీ సీఈఓ వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు. నివేదిక రూపొందిస్తామని, ఈ సమయంలో వివరాలు వెల్లడించలేమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డీవీ నరసింహారావు, మండల సర్వేయర్ గోపీనాథ్, పాఠశాల హెచ్‌ఎం ఫెర్సిస్ పాల్గొన్నారు.

విశ్వనాథునికి రుద్రాభిషేకం


ప్రత్యేకాలంకరణలో విశ్వనాథుడు


సంగమేశ్వరుడు

మనుబోలు: మండలంలోని మనుబోలు, చెర్లోపల్లి రైల్వేగేటు సమీపంలో ఉన్న విశ్వనాథస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు విశ్వనాథస్వామికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అన్నంగి వీరాస్వామి, సురేఖ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

⇨ మండల పరిధిలోని కండలేరు ఒడ్డునున్న కామాక్షితాయి సమేత సంగమేశ్వరస్వామికి అర్చకుడు సర్వేపల్లి ఫణీంద్రశర్మ పంచామృతాభిషేకం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో సంగమేశ్వరుడిని దర్శించుకున్నారు.

ఎక్కడి సమస్యలు అక్కడే..

• సీనియర్ డాక్టర్ల డుమ్మా
• లిఫ్ట్‌లకు తరచూ మరమ్మతులే..
• వేధిస్తున్న మందులు, పరికరాల కొరత
• రోగులకు చుక్కలు చూపిస్తున్న పెద్దాస్పత్రి
• నేడు హెచ్‌డీఎస్ కమిటీ సమావేశానికి కలెక్టర్ రాక

నెల్లూరులోని ప్రభుత్వ పెద్దాస్పత్రి (సర్వజన ఆస్పత్రి)లో సూపర్ స్పెషాలిటీ డాక్టర్లున్నారు. అరుదైన శస్త్ర చికిత్సలను సైతం చేస్తున్నారు. రోగులకు ఎంతో మంచి జరుగుతోంది. నాణేనికి ఇది ఒక వైపు మాత్రమే.. మరోవైపు ఇక్కడ అన్నీ సమస్యలే.. చిన్న, చిన్న సమస్యలను కూడా పరిష్కరించకపోవడంతో జిల్లా నలుమూలల నుంచి వచ్చే రోగులు నరకయాతన పడుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం కలెక్టర్ ఆనంద్ అధ్యక్షతన హాస్పిటల్ అభివృద్ధి కమిటీ (హెచ్‌డీఎస్) రెండో సమావేశం జరుగనుంది. రోగులకు నాణ్యమైన వైద్యసేవలందించే విధంగా ప్రణాళికను సిద్ధం చేస్తారో.. లేదో చూడాలి.



నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి



తరచూ మరమ్మతులకు గురవుతున్న లిఫ్ట్

నెల్లూరు(అర్బన్): నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో 750 పడకలున్నాయి. ఇక్కడ అన్నిరకాల స్పెషాలిటీ సేవలున్నాయి. ఇక్కడికి జిల్లా నలుమూలల నుంచి రోగులు వస్తుంటారు. అయితే అన్ని విభాగాల్లో సమస్యలు పేరుకుపోయి ఉన్నాయి. ఇక్కడ బీపీ ఆపరేటర్ల కొరత ఉంది. ఫిజియోథెరపీ విభాగంలో కనీస పరికరాలు లేవు. పక్షవాతం రోగులు, నరాలు పట్టేసిన వారు, డయాబెటిస్ వల్ల చేతి భుజం పట్టేసిన వారు, కొన్ని రకాల నొప్పులకు తగ్గించేందుకు ఫిజియోథెరపీ తప్పనిసరి. అయితే ఇక్కడ ఒక్క పరికరం లేదు. కేవలం రూ.నాలుగైదు వేల వంతున ఖర్చు చేస్తే అనేక పరికరాలు వస్తాయి. అయితే వాటిని కూడా కొనుగోలు చేయలేదు. గత డిసెంబర్‌లో హెచ్‌డీఎస్ కమిటీ తొలి సమావేశం జరిగింది. ఇందులో కలెక్టర్ ఆరోగ్యశ్రీ ద్వారా జమకూడిన నిధులలో రూ.2 కోట్లతో ఆస్పత్రికి కావాల్సిన పరికరాలను కొనుగోలు చేసుకోవాలని పర్మిషన్ ఇచ్చారు. అయితే నేటికీ అవసరమైన పరికరాలు కొనలేదు.

లిఫ్ట్‌లు పనిచేయవు.. సకాలంలో స్కానింగ్ చేయరు

పెద్దాస్పత్రిలో రోగుల కోసం 11 లిఫ్ట్‌లను ఏర్పాటు చేశారు. అవి ఒకరోజు పనిచేస్తే రెండు రోజులు పనిచేయవు. మరమ్మతులకు గురయ్యే ఉంటాయి. దీంతో రోగులు నాలుగు అంతస్తులు ఎక్కలేక అల్లాడిపోతుంటారు. కాగా రక్తపరీక్షలు చేసే చోట ఆటో ఎనలైజర్ మెషీన్లకు ఏసీలు అవసరం. కానీ అవి పనిచేయడం లేదు. రక్తపరీక్షల రూమ్ వద్ద బయట కనీసం తాగేందుకు నీరు కూడా ఉంచడం లేదు. అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేయాలంటే రెండు రోజుల తర్వాత రావాలంటూ అపాయింట్ మెంట్ ఇస్తున్నారు. అదేమంటే డాక్టరమ్మ ఒక్కరే ఉంటున్నారు. రోగులు ఎక్కువయ్యారు అని సిబ్బంది చెబుతున్నారు. ఈలోపుల రోగులు నానా నరకయాతన పడాల్సిందే.

మందుల కొరత

మందులు కొన్ని ఉంటే కొన్ని ఉండటం లేదు. ఉదాహరణకు గాబాపెంటిన్ మాత్రను డాక్టర్లు రాసిస్తే దానికి బదులుగా మందుల షాపులో ప్రిగాబాలిన్ ఇస్తున్నారు. పాంటప్రజోల్ మాత్ర రాస్తే ర్యానిటిడిన్ ఇస్తున్నారు. అదేంటని అడిగితే ఇవికూడా డాక్టర్ రాసిన జబ్బుకు పనిచేస్తాయని చెబుతున్నారు. ఇటీవల కాలంలో లిక్విడ్ పారా ఫిన్ మందు అయిపోయింది. ఇలాంటి అనేక రకాల మందులు ఉండటం లేదు.

కార్పొరేట్ సేవలో వైద్యులు

పెద్దాస్పత్రిలో కొంతమంది డాక్టర్లు నిజాయితీగా పనిచేస్తున్నారు. మరికొంత మంది సీనియర్ డాక్టర్లు విధులకు డుమ్మా కొట్టి ప్రైవేటు, కార్పొరేట్ సేవల్లో తరిస్తున్నారు. పెద్దాస్పత్రిలో థంబ్ వేసి అనంతరం మెడికవర్, అపోలో, నారాయణ తదితర ఆస్పత్రిలో పని చేస్తున్నారు. అడిగే వారు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా మారింది.

కమీషన్లు వచ్చే పనులకేనా బిల్లులు

పెద్దాస్పత్రిలో దివ్యాంగుల కోసం సదరమ్ క్యాంపులో కొన్ని నెలల మందు రూ.6,500 ఖర్చు చేసి షామియానాలు ఏర్పాటు చేసిన వ్యక్తికి ఇంకా నగదు ఇవ్వలేదు. చిన్న, చిన్న బిల్లులకు తిప్పుకుంటున్నారు. సూపరింటెండెంట్‌కు అద్దె కారు పెట్టిన వ్యక్తి ఎనిమిది నెలలు క్రితం తన కారును గిట్టుబాటు కాక ఆపేశాడు. అయినా నేటి వరకు బిల్లులు ఇవ్వలేదు. ఇలా చిన్న ఖర్చులకు కూడా బిల్లులు ఇవ్వడం లేదని హెచ్‌డీఎస్ కమిటీ సభ్యులే తమ జేబులో నుంచి ఖర్చు చేశారు. పలువురు డాక్టర్లు ఆస్పత్రి అవసరాల కోసం అత్యవసరంగా రూ.5 వేలు, రూ.10 వేల కోసం ఖర్చు చేశారు. వాటికి సంబంధించిన డబ్బులు కూడా ఇంకా ఇవ్వలేదు. అడిగితే హెచ్‌డీఎస్‌లో ఫండ్ లేదంటున్నారు. పరిశీలిస్తే రూ.26 లక్షల వరకు హెచ్‌డీఎస్ నుంచి ఖర్చు చేశారని తెలుస్తోంది. కమీషన్లు వచ్చే వాటికోసమే ఈ నగదు చెల్లింపులు జరిగాయనే ఆరోపణలు వస్తున్నాయి. ఒక్కో దఫా సకాలంలో ఇండెంట్ పెట్టకపోవడంతో సెలైన్ పెట్టే పైపులు కూడా రోగులే కొన్నారు. ఇలాంటివి అనేకం ఉన్నాయి. పర్యవేక్షణ లేకపోవడంతో రోగులకు సకాలంలో సేవలందడం లేదు.


వైద్యం కోసం వచ్చిన రోగులు

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం

పెద్దాస్పత్రిలో మంచి వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. అయితే కొన్నిరకాల సమస్యలున్నాయి. వాటిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తాం.
– మదపర్తి శ్రీనివాసులు, హెచ్‌డీఎస్ కమిటీ కో–ఆర్డినేటర్